ప్రజాశక్తి
సోమవారం 22 డిసెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

సోమసాగరం వద్ద ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేట సోమసాగరం చెరువు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో సమీప గ్రామ ప్రజలు ఏనుగులు చూడ్డానికి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమై ప్రజలను చెరువు పరిసరాలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ ఏనుగులను దగ్గరగా చూడడం ప్రమాదకరమని, వాటిని రెచ్చగొట్టేలా ప్రవర్తించొద్దని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చెరువు ప్రాంతానికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా రైతులు పొలాలు, తోటల వైపు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా సంచరించవద్దని ఏనుగుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, ప్రజల భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

టిడిపికి 'తేజోవంత'మైన నాయకత్వం

- ఫలించిన ఇన్‌ఛార్జి మంత్రి తెరవెనుక వ్యూహం
- మన్యం జిల్లాలో సరికొత్త పాలనకు శ్రీకారం

ప్రజాశక్తి - పార్వతీపురం

అరకు పార్లమెంటుకు టిడిపికి సరికొత్త నాయకత్వాన్ని ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు ఎస్టీ, ఒక ఎస్సీ నియోజకవర్గాలతో నిండిన పార్లమెంటు కమిటీకి నూతన కార్యవర్గాన్ని పార్టీ అధిష్టానం ఆదివారం ప్రకటించింది. గత కొద్దిరోజులుగా నాయకత్వంపై వెలువడుతున్న ఊహాగానాలకు తెరపడింది. రాజకీయాల్లో జూనియర్ అయినప్పటికీ మోజూరు తేజోవతిపై నమ్మకంతో టిడిపి నాయకత్వం ఆమెకు పెద్ద బాధ్యతలనే అప్పగించింది. రాష్ట్రంలో ఉన్న పార్లమెంటు నియోజకవర్గాల్లో విస్తీర్ణపరంగా చూసుకుంటే అరకు పార్లమెంటు నియోజకవర్గం అతిపెద్దది. మూడు జిల్లాలతో ముడిపడి ఉన్న ఈ పార్లమెంటు నియోజకవర్గ పగ్గాలు ఎస్టీలకే ఇవ్వాలని మొదటి నుంచి పార్టీ భావిస్తోంది. జిల్లాల విభజనకు ముందు పార్లమెంటు కమిటీ అధ్యక్షులుగా ప్రస్తుత మంత్రి సంధ్యారాణి పనిచేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ నాయకత్వం వహించారు. ఇప్పుడు మోజూరు తేజోవతిని అధిష్టానం నియమిం చింది. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ రాజకీయాల్లో చేరిన అనతికాలంలోనే ఆమెకు అరుదైన అవకాశం దక్కింది. గత ఎన్నికల ముందు ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ఎమ్మెల్యే సీటు వస్తుందని ఆశించారు. సాలూరు నియోజకవర్గ టిడిపి టిక్కెట్ కావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్‌తో సహా కొంత మంది సీనియర్ నాయకులు తేజోవతికి సీటు ఇవ్వాలని కోరినా అధిష్టానం సంధ్యారాణి వైపు మొగ్గు చూపింది. సీటు రాలేదని నిరాశ చెందకుండా పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆశీస్సులతో రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అనూహ్యరీతిలో పార్టీ పార్లమెంటు అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడు నియోజకవర్గాల కు చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఆమెకు మద్దతుగా నిలవడం, పార్టీ నిర్వహించిన ఐవిఆర్ఎస్ సర్వేలో ఆమెకే ఎక్కువ శాతం ఆమోదముద్ర లభించడంతో లైన్ క్లియర్ అయింది.

ఫలించిన ఇంఛార్జి మంత్రి వ్యూహం

అరుకు పార్లమెంటు నియోజకవర్గ నూతన కార్యవర్గం కూర్పు వెనుక జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యూహం స్పష్టంగా కనిపించింది. అధ్యక్షురాలిగా నియామకంపై ఎక్కడా అసంతృప్తి, వ్యతిరేకత రాకుండా చేయడంలో ఆయన రాజకీయ చతురత ప్రదర్శించారనే వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు నియమించడం వెనుక ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు వ్యూహాత్మకంగా పావులు కదిపినట్లు తెలుస్తోంది. మన్యం జిల్లాలో బలమైన బిసి సామాజిక వర్గానికి చెందిన దత్తి లక్ష్మణరావుకు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఆ సామాజిక వర్గాన్ని సంతృప్తి పరిచినట్లు చేశారు. పార్లమెంటు కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా తన అనుచరులనే నియమిం చుకోవడంలో అచ్చెన్నాయుడు కృతకృత్యుల య్యారు. పార్టీ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పార్లమెంటు కమిటీ అధ్యక్షులుగా గిరిజన మహిళా నాయకులు తేజోవతిని తెరపైకి అధిష్టానం తీసుకొచ్చింది. రానున్న మూడేళ్లలో తేజోవతి పనితీరు, నాయకత్వాన్ని అంచనా వేసి 2029 ఎన్నికల్లో ఏదో ఒక ఎస్టీ నియోజకవర్గం నుంచి ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పోటీ చేయించాలనే దూరదృష్టితో ఆమెకు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

భంజ్‌దేవ్‌ను కలిసిన తేజోవతి

మంత్రి సంధ్యారాణి, భంజ్ దేవ్ లతో భేటీ

సాలూరు: అరకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షులుగా నియామకమైన ఎం.తేజోవతి ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిశారు. అధిష్టానం ఆదేశాల మేరకు తేజోవతి మంత్రి సంధ్యారాణిని కలిసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్‌ను కలిసి చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి సలహా లు సూచనలు అందజేయాలని కోరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, సీనియర్ నాయకులు చోడవరపు గోవిందరావు, అక్కేన తిరుపతి రావు ఆమెను కలిసిన వారిలో వున్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా : తేజోవతి

పార్వతీపురంటౌన్ : అరకు పార్లమెంటరీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసి పార్లమెంటు స్థానాన్ని టిడిపి కైవసం చేసుకునేలా కృషి చేస్తానని అరకు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులుగా నియమితులైన మోజోరు తేజోవతి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేసి ఆమెకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, టిడిపి పార్టీ ఎల్లప్పుడూ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందన్నడానికి తార్కాణం తేజోవతి నియామకమేనన్నారు. మహిళా సాధికారతను నిరూపిస్తూ ఆమెకు పార్లమెంటు పార్టీ అధ్యక్షులుగా నియమించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఆమెకు అన్ని విధాలా తమ నియోజకవర్గం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం తేజోవతి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విస్తరించి ఉన్న నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పర్యటించి, కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి రానున్న రోజుల్లో ఏడు నియోజకవర్గాలు టిడిపి కైవసం చేసుకుని పార్లమెంటు సీటును సాధించడమే లక్ష్యంగా పనిచేస్తానని, దీనికి అందరి సహకారం కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

ఉజ్వల భవిష్యత్తుకు రెండు చుక్కలు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్ల వయసు గల పిల్లలకు రెండు చుక్కల పోలియో మందు వేయడం వల్ల భవిష్యత్తులో వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో చుక్కల మందు పంపిణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 99,507 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 905 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలియో రహిత సమాజన్ని నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. వారం రోజుల నుంచి అధికారులు పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, అంతే బాధ్యతగా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పోలియో మందును వేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కర రావు, డిఐఒ విజయ మోహన్, ఎస్-ఎల్ఆర్ ప్రోగ్రాం అధికారి శివకుమార్, స్థానిక నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురంటౌన్ : స్థానిక డివిఎం మునిసిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి జాయింట్ కలెక్టర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలువేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 42 పిహెచ్‌సిలను ఏర్పాటు చేసి ఎక్కడా ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకూడదనే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రయాణాల్లో ఉన్న పిల్లల కోసం బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌ల వంటి రద్దీ ప్రాంతాల్లో 19 ట్రాన్సిట్ పాయింట్లను, మారుమూల ప్రాంతాల కోసం 42 మొబైల్ టీమ్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి బూత్‌లోనూ నలుగురు చొప్పున సిబ్బంది విధులు నిర్వహిస్తూ, డేటా ఎంట్రీ, చుక్కల పంపిణీని పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆదివారం చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం సోమ, మంగళవారం ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని, ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారికి అక్కడే పోలియో చుక్కలు వేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆశా, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రారంభించారు. పలువురు పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. తల్లిదండ్రులతో మాట్లాడి పోలియో చుక్కల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్,సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోలియో చుక్క వేస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కవితా సంకలనాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక గిరిజన సామాజిక భవన్ లో ఆదివారం నిర్వహించిన సాహిత్య సభలో రెండు కవితా పుస్తకావిష్కరణలు జరిగాయి. ముంజూరు కవిత సంకలనాన్ని రచయిత దుప్పల రవికుమార్ పరిచయం చేశారు. కవి, రచయిత రెడ్డి శంకరరావు రచించిన కాలం ఒడిలో కవితా సంపుటం అనే పుస్తకాన్ని పట్టణానికి చెందిన కవి, రచయిత సిరికి స్వామినాయుడు పరిచయం చేశారు. మరో కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు ఆవిష్కరించారు. పక్కి రవీంద్ర మాస్టారు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కవి, రచయిత మల్లిపురం జగదీష్ , సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కవితా సంకలనాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

నిరసన తెలుపుతున్న గిరిజనులు

కూనేరు నైట్ హాల్ట్ బస్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కూనేరు నైట్ హాల్ట్ బస్సు, లంజి గ్రామం వరకు నిలిపివేసిన బస్సులను పునరుద్ధరించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్ల క్రితం రద్దు చేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు, లక్ష్మయ్య, వెంకటేష్ మాట్లాడారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు నైట్ చార్ట్ బస్సుతో పాటు పార్వతీపురం నుండి కూనేరు మీదుగా లంజి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు ఒక పది గిరిజన గ్రామాల ప్రజలతో పాటు మైదాన గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో బస్సులు వేయాలని కోరుతూ గతంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌ల్లో వినతులు ఇచ్చానా స్పందించడంలేదన్నారు. ఆర్‌టిసి డిఎంకు చెప్పినా పట్టించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని, లేకుంటే జనవరి 1 దాటిన తర్వాత కొమరాడతో పెద్ద ఎత్తిన ప్రయాణికులతో కలిసి ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొన్నారు.

రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌కు 25 ఏళ్లు

- నేడు గణిత మేధావి రామానుజన్ జయంతి
- గణితం పట్ల ఆసక్తి పెంచుతున్న రజనీకాంత్

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పారద్రోలి, ఆసక్తిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు రంభ రజనీకాంత్ మాస్టారు సాలూరు పట్టణంలో 'రామానుజన్ మ్యాథ్స్ క్లబ్'ను 2001లో ప్రారంభించారు. నాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా పాతికేళ్ల పాటు ఈ క్లబ్ ద్వారా వేలమంది విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తొలినాళ్లలో కేవలం సాలూరు పట్టణానికే పరిమితమైన గణిత ప్రతిభా పరీక్షలు, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయికి, ప్రస్తుతం జిల్లా స్థాయికి విస్తరించాయి. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష పోటీలను నిర్వహిస్తూ రామానుజన్ జయంతి సందర్భంగా ఈనెల 22న స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించే ప్రతిభా పురస్కారాల వేడుక కోసం విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.

గణితం పట్ల విద్యార్థుల భయాన్ని తొలగిస్తున్న డాక్టర్ రజనీ కాంత్

కొందరికి కొన్ని విషయాల్లో అమితమైన పట్టు ఉంటుంది. మరికొందరికి కొన్ని సబ్జెక్టులంటేనే భయం. ముఖ్యంగా విద్యార్థుల్లో 'గణితం' అంటే ఉండే వణుకును పోగొట్టి వారిని లెక్కల్లో మేధావులుగా తీర్చిదిద్దుతున్నారు సాలూరుకు చెందిన ప్రముఖ ప్రభుత్వ ఉపాధ్యాయులు రంభరజనీకాంత్. గత 25 ఏళ్లుగా గణిత శాస్త్ర వ్యాప్తికి ఆయన చేస్తున్న నిరుపమాన సేవలకు గుర్తింపుగా ఆయనకు 'డాక్టరేట్' పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

సొంత నిధులతో విజ్ఞాన భాండాగారం....

కేవలం విద్యార్థులకే కాకుండా, నిరుద్యోగ యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రజనీకాంత్ మాస్టారు తన సొంత నిధులతో సాలూరులో 'రామానుజన్ లైబ్రరీ'ని ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అవసరమైన పుస్తకాలను, సరైన సబ్జెక్టును అందిస్తూ ఎందరో ఉద్యోగస్తులుగా స్థిరపడటానికి ఆయన కారకులయ్యారు. గణితంపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులభమనే నమ్మకాన్ని నిరుద్యోగుల్లో బలంగా నాటారు.

ఆదర్శప్రాయమైన సామాజిక సేవ

ఉపాధ్యాయునిగా వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే, సామాజిక సేవలోనూ ఆయన ముందుంటున్నారు. గతంలో బంగారమ్మపేట మున్సిపల్ స్కూల్‌లో పనిచేస్తున్నప్పుడు, దూరం భారం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి, తన సొంత ఖర్చుతో ఆటోను ఏర్పాటు చేసి వారిని పాఠశాలకు చేరవేసేవారు. ఆయన చేస్తున్న ఇటువంటి సామాజిక కార్యక్రమాలకు గుర్తింపుగా గతంలో జిల్లా కలెక్టర్లు, పలు స్వచ్ఛంద సంస్థల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం వారికి గణితంపై భయాన్ని తొలగించి, వారిని పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలనేదే తమ క్లబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. గత 25 ఏళ్లుగా వేలమంది విద్యార్థులు గణితంలో రాణించడం తనకు ఎంతో తృప్తినిస్తోందని డాక్టర్ రంభ రజనీకాంత్ అన్నారు. వృత్తిపై నిబద్ధత, విద్యార్థుల పట్ల మక్కువ కలిగిన రజనీకాంత్ మాస్టారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పట్టణ ప్రముఖులు, విద్యార్థులు ఆకాంక్షిస్తున్నారు.

ఏకపక్షంగా పంచాయతీల విభజన

మంత్రి ఆదేశాలతో ఆదరాబాదరాగా ప్రతిపాదన

ప్రజాభిప్రాయం లేకుండా చేశారు: సర్పంచులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలో కొన్ని గ్రామపంచాయతీలను ఏకపక్షంగా విభజన చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైసిపి ఆధిపత్యం ఉన్న పంచాయతీలను విడగొట్టడమే లక్ష్యంగా అధికారపార్టీ నాయకుల అండదండలతో మండల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. విభజనకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు అమలు చేయకుండా ఏకపక్షంగా ప్రతిపాదన చేయడం పై కొన్ని పంచాయతీల సర్పంచ్ లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అవసరమైతే న్యాయపోరాటం చేయాలని భావిస్తున్నారు. పెదబోరబంద, పారన్నవలస, కూర్మరాజుపేట, కొదమ పంచాయితీలను స్థానిక సర్పంచులు, గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా విభజనకు ప్రతిపాదనలు సిద్ధం చేయడాన్ని వారు తప్పుపడుతున్నారు. స్థానిక మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకు అధికారులు పంచాయితీల విభజనకు ప్రతిపాదనలను శనివారం రాత్రి తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. దీనిపై వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అసంబద్ధంగా పంచాయతీల విభజన చేయడంపై ఎంపిటిసి సభ్యులు కె.త్రినాధ నాయుడు, సర్పంచ్ చొంగలి లక్ష్మణరావు మాట్లాడుతూ పంచాయతీల విభజనపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

దబ్బగెడ్డలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ఆదివారం చేపట్టారు. సర్పంచ్ సీదరపు లక్ష్మి ఆదేశాల మేరకు కార్యదర్శి రమేష్ జెసిబి సహాయంతో పారిశుధ్య కార్మికులు పనులు చేపట్టారు. దబ్బగెడ్డలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తీసి మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కాకుండా చేశారు.

పలుచోట్ల ఘనంగా వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను కురుపాం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ఘనంగా నిర్వహించారు. జియ్యమ్మవలస మండలం చిన మేరంగి కోటలో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు.

గుమ్మలక్ష్మీపురంలోని వైఎస్ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఎంపిపి కె.దీనమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్, నాయకులు గిరిబాబు, ఎద్దు మురళి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 120 యూనిట్ల బ్లడ్ సేకరించినట్టు జోగారావు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి నేతలందరికీ తినిపించి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శులు పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపిపిలు మజ్జి శోభారాణి, జడ్పిటిసిలు మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, బలగ రేవతమ్మ, రాష్ట్ర వివిధ అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భామిని : వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వైసిపి మండలం అధ్యక్షులు బోదేపు శ్రీనుబాబు, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నారు. కేక్ కట్ చేసి, జగన్మోహన్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి నాయకులు టింగ అన్నాజిరావు, గెల్లంకి రమేష్, బొడ్డేపల్లి ప్రసాద రావు, రొక్కం రమేష్, పోతల మజ్జి, పలువురు సర్పంచ్, ఎం పి టి సి లు, వై సి పి కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కో- ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మొండెంఖల్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని వృద్ధులకు, పేదలకు వైసిపి నాయకులు ఐ.రామకష్ణ, సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మక్కువ : జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసిపి రాష్ట్ర కార్యదర్శి, పార్వతీపురం కురుపాం నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ఎం.రంగునాయుడు మండలంలోని అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ : జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎఎంజి కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తం దానం చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశారని వాటికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, మండల వైసిపి పట్టణ అధ్యక్షులు కనపాక సూర్య ప్రకాష్, మన్మధరావు, దుప్పాడ పాపి నాయుడు, పల్లా భాను, తూముల లక్ష్మణ, లిల్లీ పుష్పనాధం తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సభలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు మావుడి శ్రీనివాసరావు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో ఉన్న శ్రీ సాయి భవాని విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని పాఠశాల అనుమతులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా అధ్యక్షులు హెచ్.సింహాచలం, కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సందర్శించిన సమయంలో పాఠశాలలో సుమారు 80మంది విద్యార్థులు ఉన్నప్పటికీ కనీస సదుపాయాల్లేవని, సరిపడా తరగతి గదులు, ఆట స్థలం, ప్రహరీగోడ లేకపోవడం వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో ఉందని, మూడో తరగతి మోహిత్ రాజ్, నాలుగో తరగతిలో పృధ్వీ విద్యార్థులను స్కూల్ హెచ్‌ఎం కొట్టిన ఘటనను తీవ్రంగా కలిసి వేసిందని అన్నారు. విద్యార్థులు ఎందుకు కొడతారని అడిగి ప్రశ్నిస్తే మా ఇష్టం నేను కొడతాం మీకు అడిగే హక్కు లేదని హెచ్‌ఎం చెప్పడం సమంజసం కాదని తక్షణమే ఉన్నతాధికారు స్పందించి విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకుని పాఠశాలను అనుమతులను రద్దు చేయాలని అన్నారు.

కొనసాగుతున్న కళాసీల సమ్మె

ప్రజాశక్తి - మక్కువ

న్యాయ సమ్మతంగా కళాశీల కూలీరేట్లను పెంచాలని నిరసిస్తూ చేపట్టిన సమ్మె ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. వర్తక సంఘాలు తిరిగివచ్చి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకూ ఈ సమ్మె కొనసాగుతుందని యూనియన్ పేర్కొంది.

భోజనశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యప్రకాశ్

సూర్యప్రకాశ్ దాతృత్వం

విద్యార్థులకు భోజనశాల నిర్మాణం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా షెడ్డు ఇదే గ్రామానికి చెందిన డాక్టర్ గుల్ల సూర్యప్రకాశ్ తల్లిదండ్రులు గుల్ల లక్ష్మునాయుడు, రాములమ్మ దంపతుల జ్ఞాపకార్థం నిర్మించారు. ఈ మేరకు సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు గుల్ల అన్నపూర్ణమ్మతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. కేవలం వైద్య వృత్తికే పరిమితం కాకుండా డాక్టర్ గుల్ల సూర్యప్రకాశ్ తన స్వగ్రామంలో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.డాక్టర్ గుల్ల సూర్య ప్రకాశ్ చేస్తున్న సామాజిక, సేవా కార్యక్రమాలలో భాగంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంకు సంబంధించి అధునాతన భోజనశాలను నిర్మించడం పట్ల గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గుంట్రెడ్డి హరికుమార్, ఉపాధ్యాయులు మూడడ్ల ఉమామహేశ్వరి, బొంతాడ జానకి, గుల్ల సింహాచలంనాయుడు, పళ్లెం భార్గవ రావు, చింతాడ తవిటాచారి, చింతాడ రుద్రకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఓర్పు, సహనమే మంచి నాయకత్వ లక్షణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ఓర్పు, సహనం ఉంటేనే మంచి నాయకుడవుతాడని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కార్యకర్తలను ఆదేశించారు. మండలంలోని గంగంపేట గిరిజన గ్రామ సమీపంలో వీరఘట్టం మండల కూటమి నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయంలో వ్యక్తిత్వం మంచి అలవాటని, ఆ దిశగా అందరూ అలవర్చుకొని ముందడుగు వేయాలన్నారు. బలమైన నాయకత్వం వీరఘట్టం మండలంలో ఉందని, అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వీరఘట్టంతో పాటు నియోజకవర్గంలోనే బిటి, సిసి రహదారులతో పాటు తాగునీటి సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. గ్రామాల్లో మనం అభివృద్ధి చేసి చూపిస్తే అదే మనకు నాయకత్వానికి తీసుకువెళ్తుందని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి రానున్న సర్పంచు, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో అన్ని సీట్లు కూటమి ప్రభుత్వం కైవసం చేసుకొనేలా పనిచేయాలని దిశ, దశ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్లా హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశికుమార్, నాగేశ్వరరావు, తూముల రమేష్, జి.గౌరు నాయుడు, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షులు కె.లలిత కుమారి, జనసేన జానీ, పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు.

ఎంసి డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కొమరాడ


శ్రీనివాసరావును అభినందిస్తున్న కుమార్

నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆర్థిక సహాయక సహకారాలు అందించిన కురుపాం ఎఎంసి డైరెక్టర్ నీరస శ్రీనివాస రావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పుల వెలమ చైర్మన్ పివిజి కుమార్ శాలువతో సత్కరించారు. జిల్లా కొప్పుల వెలమ వన సమారాధన మహోత్సవ కార్యక్రమం బాగా ఆదివారం నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు విరాళాలు సేకరించడంలో కృషిచేసిన శ్రీనివాసరావును అభినందించారు. ఇందులో భాగంగా తొడుము గ్రామానికి చెందిన పూడు లక్ష్మి కుటుంబానికి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, చుక్క జయప్రకాష్, చుక్క భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన్యం జిల్లా ఎఐటియుసి మహాసభ ఆదివారం స్థానిక రైతు బజార్ సమీపంలో గల రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి అతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నిర్మాణ బాధ్యులు పి.కామేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఉమ్మడి జిల్లా నాయకులు బుగత అశోక్, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు హాజరయ్యారు. భవిష్యత్తు పోరాటాల కోసం మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులుగా సింహాద్రి దుర్గారావు, జిల్లా అధ్యక్షులుగా రెడ్డి సత్యారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్వీఎస్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్.దుర్గాప్రసాద్, గంటా మోహన్ రావు, ఎ.కుమారమ్మ, కార్యదర్శులుగా బలగ రాధ, జి.కావ్య, నిమ్మక ప్రసాద్, సంచాన శంకర్, కార్యవర్గ సభ్యులుగా ఎం.చంద్రమౌళి, ఆర్.ఫకీరు, కుమారస్వామి, జె. నూకరాజు, కమలమ్మ, రౌతు దుర్గాప్రసాద్, విశ్వేశ్వరరావు లను ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం జిల్లాలోని అన్ని రంగాల కార్మికుల న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తుందని నాయకులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి సూచించారు. మండలంలోని నీలకంఠాపురం, మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆదివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రుల్లోని గదులు, రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ధర్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.ఎం.కె. వల్లీ, నిహారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

ఎంపిడిఒ కార్యాలయంలో సమస్యల కొలువు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనం
- పరాయి పంచన సమావేశాలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయం జిల్లాలోనూ అతి పెద్ద విస్తీర్ణంతో ఉంది. కానీ అది పేరుకు మాత్రమే. కనీసం నిలువని నీడ లేక సిబ్బంది కొరతతో దయనీయంగా పరిస్థితి ఉంది. ఒకప్పుడు సీతంపేట మండల పరిషత్ కార్యాలయం అంటే రాజుల కోట మాదిరిగా కనిపించేది. అప్పట్లో ఐటిడిఎ పిఒ వంటి ఉన్నతాధికారులు ఆ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకునేవారు. ప్రస్తుతం ఆ కార్యాలయం ఉందో లేదో తొంగి చూసిన నాథుడే కరవయ్యాడు. అంతేకాకుండా మండల అభివృద్ధి అంతా ఈ కార్యాలయం నుంచే పర్యవేక్షించబడుతున్నా ఆ కార్యాలయానికి కనీసం భవనం కానీ, స్థలం కానీ లేక పరాయి పంచన సమావేశాలు, శిక్షణలు పొందాల్సి వస్తోంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిధిలో 53 పంచాయతీలు, 475 గ్రామాలు, 31 సచివాలయాలు ఉన్నాయి. జిల్లాలోనే అతిపెద్ద మండలం. పూర్వం బిడిఒ సమితి కాలంలో సీతంపేట సచివాలయం పక్కన ఉన్న ఎకరాల్లో మండల పరిషత్ కార్యాలయం ఉండేది. ఐటిడిఎ కాలంలో ఆ స్థలంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడంతో ఉన్నత అధికారులు మండల పరిషత్ సిబ్బందిని శిథిలావస్థలో ఉన్న సెరికల్చర్ కార్యాలయ భవనానికి సాగనంపారు. ప్రస్తుతం సెరికల్చర్ భవనంలో మండల పరిషత్ కార్యాలయం కొనసాగుతోంది.

2017లో అప్పటి ఐటిడిఎ పిఒ టి.శివశంకర్ మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణాన్ని ఐటిడిఎలో శంకుస్థాపన చేశారు. అయితే ఆయన బదిలీ అయిన వెంటనే ఆ భవనం పనులు నిలిపివేశారు. దీంతో మండల పరిషత్ సిబ్బందికి అవస్థలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థగా ఉండడంతో పాటు

చిన్నది కావడంతో సమావేశాలు, శిక్షణల కోసం వైటిసికి, సామాజిక భవనానికి అద్దెలు చెల్లించి నిర్వహిస్తున్నారు. దీంతో కనీసం మండల సర్వసభ్య సమావేశాలు కూడా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఇక వర్షాకాలంలో భవనం కారుతుంది. దీంతో ఎంతో ప్రధానమైన ఫైళ్లు, కంప్యూటర్లు తడిచే ప్రమాదం ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వసతి సమస్యలతో పాటు సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉన్నప్పటికీ ఇటీవల ఆయన శ్రీకాకుళం ఎస్సీ కార్పొరేషన్ ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. సీనియర్ అసిస్టెంట్ విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. టైపిస్ట్ ఉద్యోగస్తుడి పై రేగిడి బదిలీపై వెళ్లిపోయారు. అదేవిధంగా ఆఫీసు సబార్డినేటర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో బడ్జెట్ 15 ఆర్థిక సంఘం నిధులు, పెన్షన్లు, ఆడిట్, గ్రీవెన్స్, అంచనాల వంటి పనులు ఉన్న ఎంపిడిఒపై భారం పడుతుంది. డిప్యూటీ ఎంపిడిఒలను ఇటీవల ప్రభుత్వం నియమించింది. మరి కొద్ది రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు వస్తున్నాయి. దీంతో ఆఫీస్ కార్యాలయంతో పాటు సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోతే ఇబ్బంది పడాల్సి పరిస్థితి నెలకొంది..

ఉన్నతాధికారులకు తెలియజేశాం

సిబ్బంది కొరత ఉందని ఉన్నత అధికారులకు తెలియజేశాం. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉన్న సిబ్బందితోనే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భవనం శిథిలావస్థలో ఉంది. సమావేశాలు పొరుగు కార్యాలయాల్లో నిర్వహించడం వాస్తవమే.

బిబి మిశ్రా,
ఎంపిడిఒ, సీతంపేట.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

బలిజిపేట: పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అన్ని జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఎంఇఒ-1 ఎస్.సింహాచలం సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్షించారు. ముఖ్యంగా సబ్జెక్టు టీచర్లు స్లిప్ టెస్టులను షెడ్యూలు ప్రకారంగా నిర్వహణ చేస్తున్నారో లేదో ప్రతి సబ్జెక్టు టీచర్ రికార్డులను తనిఖీ చేశారు. అలాగే స్లిప్ టెస్ట్ మార్కులను ఆన్లైన్లో సబ్మిట్ చేశారా లేదా అనేది కూడా పరిశీలించారు. ఉపాధ్యాయులంతా స్లిప్ టెస్టులను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తూ, వాటిని ఆన్లైన్ చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు బి.వెంకటరమణ, స్టాఫ్ సెక్రటరీ నారాయణస్వామి, బొత్స గణేష్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజన్నదొర

వైసిపికో రూలు, టిడిపి వారికో రూలా?

- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు
- రానున్నది జగన్ ప్రభుత్వమే : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర విమర్శించారు. వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక బోసు బొమ్మ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన నివాసంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గడచిన రెండేళ్ళ గా నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పరివారంలోని వ్యక్తులు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పట్టణానికి చెందిన ఓ వితంతు మహిళా ఉద్యోగి ఫిర్యాదు మేరకు పిఎ సతీష్‌పై ఇంతవరకు కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని చెప్పారు. తన పిఎ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మంత్రి సంధ్యారాణి కారు డ్రైవర్ హరికుమార్ సోషల్ మీడియాలో మెసేజ్‌లు పెట్టినందుకు ఫిర్యాదు చేస్తే ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. అదే మంత్రి పిఎ సతీష్ ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేశారని చెప్పారు. పోలీసులు ఇంత ఏకపక్షంగా వ్యవహరించడం తానెప్పుడూ చూడలేదన్నారు. అధికారపార్టీకో రూలు, ప్రతిపక్ష పార్టీకో రూలు వున్నట్లు పోలీసు అధికారుల తీరు కనిపిస్తోందని చెప్పారు. మంత్రి పరివారం లోని కొంతమంది వ్యక్తులు తన అనుచరులు, తనపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని చెప్పారు. సమయం వచ్చినప్పుడు తాను వారి సంగతి చూస్తానని హెచ్చరించారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో సమన్యాయం పాటించకపోతే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని చెప్పారు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు భృతి వంటి హామీలు అమలు చేయలేదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు సహా మంత్రులంతా అబద్దాల కోరులని ధ్వజమెత్తారు. వైసిపి హయాంలో మంజూరైన అభివృద్ధి పనులనే తాము చేసినట్లు టిడిపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు రెడ్డి పద్మావతి, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, పాచి పెంట మండల సీనియర్ నాయకులు పి.దినబాబు, సరాది అప్పలనాయుడు, మెంటాడ మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, పట్టణ నాయకులు పిరిడి రామకృష్ణ, ఎం.అప్పారావు, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పోలియోరహిత సమాజం అందరి బాధ్యత : ఎమ్మెల్యే

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోలియోరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయం వీధిలో గల అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రోత్సహించారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదాన్ని పాటిస్తూ గుర్తు చేస్తూ తమ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రతి బిడ్డ ఆరోగ్యానికి పోలియో చుక్కలు ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కెవిఎస్ పద్మావతి, ఎంపిడిఒ ఐవి లక్ష్మి, వైద్యులు బుద్దేశ్వరరావు, అభిలాష్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు రామారావు, చిన్న, రాజేష్, జానకి, రామారావు, హితీష్ కుమార్, మన్మథ ,దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రమై కురుపాంలో నిర్వహించిన పల్స్ పోలియోలో రావాడ రామభద్రపురం పిహెచ్ వైద్యాధికారి డాక్టర్ కె.సుస్మిత పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి పోలియో రహిత సమాజం సాధనకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ పి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెద అంకలాం పిహెచ్‌సి వైద్యాధికారులు పి.శ్రీకాంత్, పి.పావని, పి.ఉషారాణి ఆధ్వర్యంలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. పెదంకలాంలో ఎంపిపి బి.రవణమ్మ, అప్పయ్యపేటలో ఎంపిడిఒ ఎం ఎల్ ఎన్ ప్రసాద్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాలనాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ టి.చంద్రశేఖర్, అంటిపేట పిఎసిఎస్ అధ్యక్షులు యోగిరెడ్డి భాస్కరరావు పోలియో చుక్కలు వేశారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఇటికి పట్టీల వద్ద పోలియో చుక్కలను అక్కడ ఉండే పిల్లలకు వైద్య సిబ్బంది వేశారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని అన్నవరం పిహెచ్‌సి పరిధిలో 2441 పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా, 2300 మందికి చుక్కలు వేశారు. అలాగే ఎం.సింగపురం పిహెచ్‌సి పరిధిలోని 1660 మంది చిన్నారులకు గాను 1582మందికి పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి సోమవారం ఇంటింటికీ సిబ్బంది వెళ్లి పోలియో చుక్కలు మందులు వేస్తారని ఎంసింగుపురం పిహెచ్‌సి వైద్యులు రవీంద్ర తెలిపారు. బెజ్జి, తుమరాడ, పనుకువలస పోలియో కేంద్రాలను ప్రోగ్రాం అధికారి వినోద్ కుమార్ సందర్శించి సిబ్బంది పలు సూచనలు అందించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పాచిపెంట : మండలంలోని మాతుమూరులో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో చుక్కల మందును ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వీరఘట్టం, ఎం.రాజపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు చుక్కలు వేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి టి.జగన్మోహన్రావు, వైద్యాధికారులు బి.ప్రదీప్ కుమార్, ఎం.సాయికుమార్, ఎ.మానస, పి.గణేష్‌గౌతమ్, కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, జన జానీ, జంపు చంద్రశేఖర్, సూపర్వైజర్ ఆదిలక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక పిహెచ్‌సి పరిధిలోని 2,712 మంది 3024 మందికి పోలియో చుక్కలు వేసినట్లు. వైద్యాధికారి. బి.ప్రదీప్ కుమార్ తెలిపారు. బిటివాడ పిహెచ్‌సి పరిధిలోని. 1,607 మంది పిల్లలకు గాను. 2,272 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ఎ.మానస తెలిపారు. కార్యక్రమంలో. సూపర్వైజర్లు. ఎం ఎల్ హెచ్ పీ లు, ఏఎన్ఎంలు, హెల్త్ సహాయకులు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు పిహెచ్‌సిల పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 98శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివ కుమార్, సంతోషలక్ష్మి దామోదర రావు, కొండపల్లి రవీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : శతశాతం పల్స్ పోలియో కార్యక్రమం పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. మండలంలోని గళావల్లి పిహెచ్‌సిలో చేపడుతున్న పల్స్‌పోలియోను ఆయన పరిశీలించారు. గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. పక్కాగా కార్యక్రమం నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు బి.రేవతి, జి.రిషి కుమార్, ఇఒ నరసింహులు, హెచ్ఎస్ వెంకటరమణ, హెచ్‌వి చిన్నతల్లి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి, గొయిది కేంద్రాల్లో చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్వో కె విజయ పార్వతి సందర్శించారు. పోలియో చుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లందరికీ చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర, గొట్టివలస, శివ్వాం, గరుగుబిల్లి, దళాయి వలస, మరుపెంట తదితరు గ్రామాల్లోని పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి తిరుమలప్రసాద్ పరిశీలించారు. గరుగుబిల్లి పిహెచ్‌సిపరిధిలోని 20 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశామన్నారు. కార్యక్ర మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి, కురుపాంలో వైద్యాధికారి సుస్మిత, సీతానగరం ఎంపిపి రమణమ్మ, బలిజిపేట పిహెచ్‌సిలో పల్స్‌పోలియో గురించి అధికారులను కలిసిన డిఎంహెచ్ఒ భాస్కరరావు

కాలుష్య కోరల్లో బంగారమ్మ కాలనీ వాసులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని బంగారమ్మ కాలనీ ప్రజలను కాలుష్య కోరలు పీడిస్తున్నాయి. జనావాసాల మధ్య అక్రమంగా కొనసాగుతున్న ఒక స్నాక్స్ ఫ్యాక్టరీ వెదజల్లుతున్న విషతుల్యమైన పొగ, స్థానికుల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. సెల్వి అండ్ శ్రీకృష్ణ స్నాక్స్ ఫ్యాక్టరీగా పిలవబడుతున్న ఈ పరిశ్రమ మూడేళ్ల క్రితం చిన్న కుటీర పరిశ్రమగా మొదలై, ఇప్పుడు భారీగా విస్తరించి, చుట్టుపక్కల ప్రజల జీవితాలను నరకప్రాయం చేసింది. ప్రధానంగా పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే వస్తువులు ఇక్కడ తయారవుతుండగా, ఫ్యాక్టరీ నుంచి నిత్యం వెలువడే దట్టమైన పొగ కారణంగా వార్డు ప్రజలు రోగాల పాలై ఆసుపత్రులకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి దాపురించింది.

ఈ ఫ్యాక్టరీ కట్టెల పొయ్యి మీద వంటలు చేయడం వల్ల పొగ విపరీతంగా వెలువడుతోంది. ఈ పొగ నేరుగా చుట్టుపక్కల ఇళ్లల్లోకి చొరబడుతుండడంతో ప్రజలకు ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయి. కాలుష్యం నుంచి కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు రెండేళ్లుగా జరుగుతున్న ఈ పోరాటాన్ని, పౌరుల ఫిర్యాదులను ఏమాత్రం పట్టించుకోకపోవడం అత్యంత శోచనీయం. గత జూలైలోనే స్థానిక వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా కనీసం స్పందించని వైనం చూస్తుంటే, ప్రజల ఆరోగ్యాలను బలిచ్చి మరీ ఫ్యాక్టరీ యాజమాన్యానికి అధికారులు ఎలా కొమ్ముకాస్తున్నారో అర్థమవుతోంది. అంతేకాకుండా స్థానిక మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి కూడా వార్డు ప్రజలు రెండు దఫాలుగా ఫిర్యాదు చేశారు. అయితే కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఈ సమస్యను పరిష్కరించడంలో ఆమె కూడా కనీస బాధ్యత తీసుకోకపోవడం పట్ల వార్డు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామాన్య ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న ఈ ఫ్యాక్టరీని తరలించాలని వార్డు మహిళలు లక్ష్మి, మాధవి, సౌజన్య, రాధ, స్వర్ణ లత, సంధ్య తదితరులు చేసిన పోరాటం చేసినా ఫలితం

ఫిర్యాదు చేసినా పట్టించుకొనే నాథుడే కరువు

కాలుష్యం వెదజల్లుతున్న స్నాక్స్ ఫ్యాక్టరీ

లేకుండా పోయింది. కాలుష్య నివారణకు చివరి ప్రయత్నంగా ఈ నెల 1న ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా పార్వతీపురం కలెక్టర్‌కు కూడా స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ కనీసం స్పందించకపోవడం దురదృష్టకరం. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని వారు ఆరోగ్యంగా ఉండేలా చూసే అధికారులు గానీ, నాయకులు గానీ పట్టణంలో లేకపోవడం విచారకరం. మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొరను కూడా కలిసి తమ సమస్యను చెప్పుకున్నామని, కనీసం ఆయనైనా తగు సహాయం అందించాలని వేడుకున్నామని వార్డు ప్రజలు తెలియజేశారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. నిత్యం బిజీ బిజీగా ఉన్న పర్యాటకులు అడ్వెంచర్ పార్క్‌లో తమ స్నేహితులు కుటుంబీకులతో కాసేపు సేద తీరుస్తున్నారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు సహాసోపేత క్రీడ నిర్వహించారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

పుట్టినరోజు వేడుకలకు వచ్చి మృత్యువాత

ప్రజాశక్తి- రేగిడి

వీరఘట్టం మండలం బెజ్జి గ్రామానికి చెందని భాను ప్రకాష్(28) కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలకు విశాఖపట్నం నుంచి పాలకొండ ఆదివారం వచ్చి అక్కడ ఎంతో సంతోషంగా గడిపి విశాఖపట్నం తిరిగి ప్రయాణంలో మార్గమధ్యంలో మృత్యువాత పడిన సంఘటన పలువురిని కలచి వేసింది. పోలీస్ ఇచ్చిన సమాచారం మేరకు రేగిడి మండలం చిన్న శిర్లాం సమీపం పెట్రోల్ బంక్ వద్ద వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం బెజ్జి గ్రామానికి చెందిన బొడ్డు భాను ప్రకాష్ అక్కడిక్కడే మృతి చెందారు. పాలకొండ నుంచి ద్విచక్ర వాహనంపై విశాఖ పట్నం వెళ్తున్న భాను ప్రకాష్ రాజాం నుంచి పాలకొండ వెళుతున్న వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంతో పాటు భాను ప్రకాష్ తల శరీర భాగాలు నుజ్జు నుజ్జు కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. భాను ప్రకాష్ విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఆయనకు భార్య దేవి, తండ్రి శ్రీనివాసరావు, తల్లి లక్ష్మి ఉన్నారు. కుటుంబాన్ని పెంచి పోషించిన కుమారుడు ఇలా అర్థంతరంగా కాలం చల్లడంతో ఆ కుటుంబం రోడ్డుని పడింది. మృత దేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. ఎస్ఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీతంపేటలో పారిశుద్ధ్యంపై ఎన్ఎస్ఎస్ అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో గల సీతంపేటలో ఆదివారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బహిరంగ మలవిసర్జన వల్ల కలిగిన అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్ కుమార్, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.